సాక్షి
జగిత్యాల
గురువారం । 20 । జూలై । 2023



33 రకాల వాయినాలు

ధర్మపురి: మన అమ్మకు మనసార మన సారె కార్యక్రమంలో భాగంగా కన్యకాపరమేశ్వరి అమ్మవారికి బుధవారం 33 రకాలతో వాయినాలు సమర్పించారు.



జిల్లాలో జోరుగా వరినాట్లు

జిల్లాలో వర్షాలు కురుస్తుండటంతో వరి నాట్లు జోరందుకున్నాయి. కూలీల సమస్య రైతులను వేధిస్తుండటంతో మహిళా గ్రూపులకు అడిగినన్ని డబ్బులు ఇవ్వాల్సి వస్తోంది. 8లో

గరిష్టం/కనిష్టం
27.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

పేదలు లేని 'పెద్ద'పల్లి

- తరువాత స్థానంలో కరీంనగర్
- జాతీయ బహుముఖ పేదరిక సూచిలో వెనకబడ్డ జగిత్యాల

సాక్షిప్రతినిధి,కరీంనగర్: పేదరిక నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. తాజాగా 'జాతీయ బహుముఖ పేదరిక సూచి (ఎంపీఐ)– ఒక ప్రగతి సమీక్ష'పేరిట నీతి ఆయోగ్ విడుదలచేసిన నివేదిక గణాంకాలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. జాతీయస్థాయిలో నిర్వహించిన ఈసర్వేలో పలు ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. ముఖ్యంగా దేశంలో పేదరికం తగ్గి, ఆర్థిక అంతరాలు క్రమంగా సమసిపోతున్నాయని నివేదిక పునరుద్ఘాటించింది. నేషనల్ ఫ్యామిలీ అండ్ హెల్త్ సర్వే (ఎన్‌హెచ్ఎఫ్ఎస్)–4తో ఎన్‌హెచ్ఎఫ్ఎస్–5తో పోల్చి ఈ సర్వే వివరాలను నీతి ఆయోగ్ విడుదల చేసింది. దీని ప్రకారం.. ఉమ్మడి జిల్లాలోనూ పేదరికం తగ్గింది. జగిత్యాలలో 4.77 శాతం, రాజన్న సిరిసిల్లలో 3.68 శాతం, కరీంనగర్‌లో 2.50 శాతం, పెద్దపల్లిలో 2.17 శాతంగా నమోదైంది. ఇందులో పెద్దపల్లి అతితక్కువ 2.17 శాతం పేదరికంతో రాష్ట్రంలో అత్యంత తక్కువ సంఖ్యలో పేదలు ఉన్న జిల్లాగా రికార్డు సృష్టించింది. జిల్లాలో అధికశాతం పారిశ్రామిక ప్రాంతం కావడం, రోడ్డు రవాణా, రైల్వే కనెక్టివిటీ, విద్యా, వైద్యం తదితర సదుపాయాల దృష్ట్యా మొదటి నుంచి పెద్దపల్లి జిల్లా ముందువరుసలో నిలిచింది. తాజాగా నీతిఆయోగ్ విడుదల చేసిన నివేదికలోనూ ఇదే విషయం పునరావృతం కావడం గమనార్హం.

ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం



జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యమని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విదేశాల్లోని పలు ప్రైవేటు, కార్పొరేట్ కంపెనీల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆగస్టు 5న ధర్మపురిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి గార్డెన్‌లో జిల్లా పోలీసు, ఎల్ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సహకారంతో మెగా జాబ్–వీసా మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేళాలో 100 ప్రైవేటు, కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు హాజరై 4వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని అన్నారు. విదేశాల్లో ఉద్యోగం చేయాలనుకున్న వారికి మంచి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన యువతీ, యువకులు తమ వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో స్వయంగా సమర్పించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు వెంకటస్వామి, రాజశేఖర్ రాజు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే కేసీఆర్ లక్ష్యం



రైతులతో నిరసనలో పాల్గొన్న జెడ్పీచైర్‌పర్సన్, ఎమ్మెల్యే

జగిత్యాలరూరల్: రైతును రాజు చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాలరూరల్ మండలం పొలాస రైతువేదిక వద్ద కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో సాగు నీరు అందక ఎన్నో ఎకరాల భూమి బీడు భూములుగా మిగిలాయన్నారు. విద్యుత్ సరఫరా లేక ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయని, ఆనాడు రైతులు గుర్తుకు రాని కాంగ్రెస్ నాయకులకు ఇప్పుడు విద్యుత్ గురించి మాట్లాడటం సరికాదన్నారు. రైతుబంధు, రైతుబీమాతో పాటు విత్తనాలపై సబ్సిడీ, సాగునీరు అందించడంతో పాటు రైతాంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాలముకుందం, సింగిల్ విండో చైర్మన్లు సందీప్‌రావు, మహిపాల్‌రెడ్డి, రైతుబంధు మండల కన్వీనర్ నక్కల రవీందర్‌రెడ్డి, నాయకులు నరేశ్, ఆనందరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వానొచ్చే.. వరదొచ్చే!

- వరుస వానలతో ప్రాజెక్టులకు మొదలైన వరద
- వరినాట్లు మొదలుపెట్టిన రైతన్నలు
- ఎగువ ప్రవాహాలతో మిడ్‌మానేరు దిగువకు నీరు
- మానేరుకు వాగుల నుంచి మొదలుకాని వరద
- ఎస్సారెస్పీ, ఎల్లంపల్లిలో పెరుగుతున్న వరద ఉధృతి



ఎస్సారెస్పీకి 24,375 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాకు సాగు, తాగునీరు అందించే శ్రీరాంసాగర్‌ప్రాజెక్ట్‌కు భారీగా వరద నీరు వస్తోంది. కొద్దిరోజులుగా ప్రాజెక్ట్ ఎగువ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండటంతో బుధవారం మధ్యాహ్నానికి 24,375 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్ట్ నీటిమట్టం 1091.00 అడుగులకు ప్రస్తుతం 1071.90 అడుగులుగా ఉంది. ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 90.3 టీఎంసీలకు ప్రస్తుతం 32.913 టీఎంసీలు ఉంది. వర్షాలకు ముందు కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా నీటిని ఎత్తిపోసినప్పటికీ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో కాళేశ్వరం నీటిని ఆపేశారు. ప్రస్తుతం ప్రాజెక్ట్ నుంచి 1,029 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉంది.

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: మూడురోజులుగా వరుసగా కుస్తున్న వర్షాలతో రైతులు పొలంపనులు మొదలుపెట్టారు. బుధవారం సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో అత్యధికంగా 3.2 సెం.మీ వర్షపాతం, పెద్దపల్లిలో కాల్వ శ్రీరాంపూర్‌లో 2.9 సెం.మీ, జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం 2.8 సెం.మీ, కరీంనగర్ జిల్లా ఇల్లందకుంటలో 2.9 సెం.మీల వర్షపాతం నమోదైంది.

పెరుగుతున్న ఇన్‌ఫ్లో..

కాళేశ్వరం ఎత్తిపోతల నుంచి కొన్నిరోజులు, ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా మొదలైన వరద ప్రవాహాలతో ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టుల్లోకి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. ఈనెల 15 వరకు ఎలాంటి వానలు లేకపోవడంతో ఇక ప్రాజెక్టులను కాళేశ్వరం నీటితో నింపేందుకు పంపింగ్ ప్రారంభించారు. రామడుగు లక్ష్మీపూర్ పంప్‌హౌస్ ద్వారా కాళేశ్వరం జలాలతో మిడ్‌మానేరును నింపుతున్నారు. అక్కడి నుంచి దిగువకు వదులుతారు. మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సైతం ఈనెల 17న మిడ్‌మానేరు నుంచి కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా పంపింగ్ చేసిన 5 టీఎంసీల నీటిని దిగువన ఉన్న లోయర్‌మానేరు డ్యాంకు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇంతలో వర్షాలు మొదలయ్యాయి. దీంతో రైతులు నాట్లు వేయడంలో తలమునకలయ్యారు. మానేరుపై నిర్మించిన ప్రాజెక్టులకు మానేరు నది, మోయతుమ్మెద వాగు, ఎస్సారెస్పీ, మూలవాగుల నుంచి వచ్చే ప్రవాహాలే మూలాధారం. వాటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి వరద లేకపోవడంతో ప్రాజెక్టులలోకి తక్కువ నీరు చేరుతోంది.

మిడ్‌మానేరు నుంచి దిగువకు..

మానేరుపై బోయిన్‌పల్లి వద్ద నిర్మించిన మిడ్‌మానేరు ప్రాజెక్టుకు భారీగా ఇన్‌ఫ్లో వస్తోంది. ఈనెల 12న ప్రాజెక్టులో 15.61 టీఎంసీల నీరు ఉండగా.. ప్రస్తుతం అదే స్థితి కొనసాగిస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వరదకు తోడు, ప్రాజెక్టులోకి లక్ష్మీపూర్ పంప్‌హౌస్ ద్వారా 9 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ప్రాజెక్టులోకి చేరుతుంది. మిడ్‌మానేరు ప్రాజెక్టు ఆరుగేట్ల ద్వారా 9,320 క్యూసెక్కుల నీరు లోయర్‌మానేరు డ్యాం (ఎల్ఎండీ) ప్రాజెక్టులోకి దిగువకు వదలుతున్నారు. ప్రాజెక్టు నుంచి వెళ్లే నీటితో ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాలకు నీరందనుంది.

ప్రాజెక్టు:	సామర్థ్యం	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో	వారం రోజుల క్రితం నీటినిలువ
మిడ్‌మానేరు	27.50 టీఎంసీ	15.67 టీఎంసీ	8,500 క్యూసెక్కులు	9320 క్యూసెక్కులు	15.61 టీఎంసీలు
లోయర్‌మానేరు	24.03 టీఎంసీ	09.5 టీఎంసీ	9,210 క్యూసెక్కులు	210 క్యూసెక్కులు	8.44 టీఎంసీలు
ఎల్లంపల్లి	20.17 టీఎంసీ	15.17టీఎంసీ	5,712 క్యూసెక్కులు	12,721 క్యూసెక్కులు	13.78 టీఎంసీలు

జగిత్యాల జిల్లాలో..



మత్తడి దుంకుతున్న మల్లాపూర్ పెద్ద చెరువు

- ఇబ్రహీంపట్నంలో 28.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, మల్లాపూర్‌లో 23.2, రాయికల్‌లో 15.2, బీర్‌పూర్‌లో 23.0, సారంగాపూర్‌లో 14.2, ధర్మపురిలో 16.4, బుగ్గారంలో 15.7, జగిత్యాల రూరల్‌లో 16.0, జగిత్యాల అర్బన్‌లో 12.6, మేడిపల్లిలో 14.0, కోరుట్లలో 11.6, మెట్‌పల్లిలో 17.1, కథలాపూర్‌లో 15.2, కొడిమ్యాలలో 16.2, మల్యాలలో 16.7, పెగడపల్లిలో 14.5, గొల్లపల్లిలో 10.3, వెల్గటూర్‌లో 19.4, ఎండపల్లిలో 18.1, భీమారంలో 11.3 మి.మీ.వర్షం కురిసింది.

- దిగువనే ఉన్న లోయర్ మానేరులోకి మిడ్‌మానేరు మినహా పెద్దగా ఇన్‌ఫ్లో లేదు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా.. వర్షాభావ పరిస్థితుల కారణంగా గతవారం వరకు కేవలం 8 టీఎంసీల నీరే ఉంది. ప్రస్తుతం మిడ్‌మానేరు నుంచి వచ్చే నీటి ద్వారా 9.5 టీఎంసీలకు చేరింది. లోయర్‌మానేరు డ్యాంకు ప్రధాన ఆధారమైదన మోయతుమ్మెద వాగు నుంచి ఆశించిన స్థాయిలో వరద రాకపోవడంతో లోయర్‌మానేరు నెమ్మదిగా నిండుతోంది. ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 9.88 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది.
- పెద్దపల్లి జిల్లా ఎల్లంపల్లికి వరద పోటెత్తుతోంది. గోదావరినదిపై నిర్మించిన ఈ ప్రాజెక్టు పూర్తిసామర్థ్యం 20.175 టీఎంసీలు. వర్షాలు జాప్యం కావడంతో గతవారం ప్రాజెక్టులో కేవలం 13 టీఎంసీల నీరు అందుబాటులో ఉండేది. ప్రస్తుతం ఎగువన కురుస్తున్న వర్షాలు, కడెం, ఎస్సారెస్పీ నుంచి దిగువకు వస్తున్న నీరు భారీగా ఉంది. దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం 15.17 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో 5,712 క్యూసెక్కులుగా ఉండగా, ఔట్‌ఫ్లో 12,721 క్యూసెక్కులుగా ఉంది. ఎగువ నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు వదులుతున్నారు. ఈ ప్రాజెక్టు నుంచి 2.20 లక్షల ఎకరాలకు నీరందిస్తారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- కలెక్టర్ యాస్మిన్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాలక్రైం: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ యాస్మిన్ బాషా కోరారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఎగ్గడి భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డుభద్రత కమిటీ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలతో ఏ ఒక్కరూ వైకల్యం బారిన పడకుండా, ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు లేకుండా భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు కండీషన్‌లో లేకపోవడం, సైనేజ్ బోర్డులు, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్‌లు లేకపోవడం వల్ల అక్కడక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని, సంబంధిత ఇంజినీరింగ్ శాఖలు అలాంటి ప్రదేశాలను గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీసు, రవాణా శాఖ అధికారులతో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేవించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసరంగా స్పందించేందుకు వీలుగా జిల్లా ఏరియా ఆస్పత్రి ప్రాంతీయ వైద్యశాలలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. ఎస్పీ భాస్కర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని అన్నారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు జిల్లాస్థాయిలో ఒక సీఐ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ట్రాఫిక్ అనాలసిస్ బ్యూరోను ప్రారంభించి ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలు గుర్తించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ర్యాష్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్, ట్రిపుల్ రైడ్ లాంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ చందర్‌రావు, డీఎంహెచ్‌వో శ్రీధర్, ఆర్టీవో వంశీధర్, డీఎస్పీలు వెంకట్‌స్వామి, శ్రీనివాస్, పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ, పోలీస్ అధికారులు, రోడ్ సేఫ్టీ ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఉచిత కరెంటుపై రేవంత్ వ్యాఖ్యలు సరికాదు

- రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్



సీఎం, కేటీఆర్‌ల చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి ఈశ్వర్, బీఆర్ఎస్ నాయకులు

పెగడపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయరంగానికి అందిస్తున్న ఉచిత విద్యుత్‌పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని, రానున్న రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పుట్టగతులుండవని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం పెగడపల్లి మండలం నందగిరి రైతువేదికలో రైతులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. రైతు సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాల వినియోగంతో రైతుల్లో ఆత్మగౌరవం పెరిగిందని అన్నారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసి ప్రతీ ఎకరాకు నీరందించి సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. 24 గంటల కరెంటుతో పాటు, రైతుబంధు, రైతుబీమా పథకాలు అమలు చేసిన విషయం వాస్తవం కాదా అని కాంగ్రెస్ నాయకులను మంత్రి ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక పంపుసెట్ల వద్ద రైతులు పడిగాపులు కాసిన విషయాన్ని మరిచిపోలేదన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రైతుబంధు చైర్మన్ నరేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజేందర్‌రావు, ఎంపీపీ శోభ, విండో చైర్మన్లు భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, సర్పంచులు రాకేశ్, లక్ష్మణ్, అనూషా, హారిక, నిహారిక, ఎంపీటీసీలు గంగారెడ్డి, స్వాతి, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



జగిత్యాల: పెండింగ్‌లో ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒడ్నాల రాజశేఖర్ అన్నారు. బుధవారం జిల్లాలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు, పాఠశాలల్లో స్కావెంజర్ల నియామకం, పీఆర్సీ కమిటీని ఏర్పాటు తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. నాయకులు శ్రీనివాస్‌మూర్తి, రామకృష్ణ, రమేశ్, భీమయ్య, రఘునందన్, రజినీకాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రైవేటు వైద్యురాలి సేవలు



సోమవారం 12.30 గంటలకు డ్యూటీ డాక్టర్లు వెళ్లిపోవడంతో వైద్యసేవలు అందిస్తున్న ప్రైవేటు వైద్యురాలు

రాయికల్:(జగిత్యాల): రాయికల్‌లోని వైద్య విధాన పరిషత్‌ను సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు 'సాక్షి' రోగుల సమాచారం మేరకు ఆస్పత్రిని సందర్శించగా ఓ ప్రైవేటు వైద్యురాలు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి ఏకంగా వైద్యసేవలు అందించారు. ఈ విషయంపై వైద్యురాలు మౌనికను 'సాక్షి' ప్రశ్నించగా ఆర్‌బీఎస్‌కేలో పనిచేస్తున్నానని తప్పుడు సమాచారం ఇవ్వగా సూపరింటెండెంట్ రవి సైతం ఆ ప్రైవేటు వైద్యురాలికి వత్తాసు పలికారు. ఈ విషయంపై సాక్షి ఆరా తీయగా రాయికల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మౌనిక వైద్యురాలుగా పనిచేస్తున్నారని, సోమవా రం మధ్యాహ్నం 12.30 విధులు నిర్వహించాల్సిన వైద్యులు జగిత్యాలలోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లడంతో ఆ సమయంలో రోగులు రావడంతో ఓ ప్రైవేటు వైద్యురాలిని ప్రభుత్వ ఆస్పత్రికి పంపించి వైద్యసేవలు చేయించినట్లు తెలిసింది. ఈ విషయంపై ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనును బుధవారం వివరణ కోరగా రాయికల్ మండలంలో డాక్టర్ రేవ తి, డాక్టర్ నరేందర్‌లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని సమాధానమిచ్చారు. కాగా, ఈవిషయంపై జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ సుదక్షిణ దేవిని వివరణ కోరగా సమయపాలన పాటించని వైద్యులకు నోటీసులు జారీ చేశామన్నారు. ఏదేమైనా ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యురాలు ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలు అందించడం రాయికల్ వైద్య విధాన పరిషత్ వైద్యుల పనితీరుకు నిదర్శనం. కలెక్టర్ స్పందించి ఇతర ప్రైవేటు వైద్యులతో వైద్యసేవలు అందిస్తున్న సంబంధిత ఇన్‌చార్జి వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నులిపురుగును నులిపేద్దాం

- నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం
- జిల్లావ్యాప్తంగా అల్బెండజోల్ మాత్రలు పంపిణీ
- ఏర్పాట్లు పూర్తిచేసిన వైద్యశాఖ అధికారులు



పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న అధికారులు (ఫైల్)

మల్లాపూర్: చిన్న పిల్లల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనతకు కారణమయ్యే నులిపురుగుల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. నులిపురుగుల నివారణకు నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా ఏటా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా నేడు 19 ఏళ్ల లోపు బాలిబాలికలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 2,50,164 మంది చిన్న పిల్లలకు ఈనెల 20, 27 తేదీల్లో మాత్రలు వేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మాత్రలను అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్నారు. తల్లిదండ్రులు, విద్యసంస్థలు గురువారం పిల్లలకు మాత్రలు వేయించాలని ఈరోజున వేయించలేకపోతే మళ్లీ 27న నిర్వహించే కార్యక్రమంలో తప్పనిసరిగా వేయించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో అర్హులైన పిల్లలు

19 ఏళ్లలోపు పిల్లలు : 2,50,164

అంగన్‌వాడీ కేంద్రాలు (1–5 ఏళ్ల పిల్లలు) : 68,,573

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు(6–16 ఏళ్లు): 1,49,570

ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు (16–19 ఏళ్లు): 21,098

వొకేషనల్ కళాశాలలు : 1,638

బడి బయట పిల్లలు : 9,285

అన్ని ఏర్పాట్లు చేశాం

జిల్లావ్యాప్తంగా 1–19 ఏళ్ల లోపు పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఒకటి నుంచి రెండేళ్లలోపు పిల్లలకు సగం మాత్ర, రెండు నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు ఒక మాత్ర వేయించాలి. ఈ మాత్రలు వేసుకోవడం వల్ల నులిపురుగుల నివారణతో పిల్లల్లో ఎదుగుదల ఉంటుంది. పిల్లలు మధ్యాహ్న భోజనం చేసిన 20 నిమిషాల తర్వాతే మాత్రలు వేయించాలి. విద్యాసంస్థలు మాత్రలను పిల్లలతో ఇంటికి పంపించొద్దు. – శ్రీధర్,, డీఎంహెచ్‌వో, జగిత్యాల

తనిఖీల్లో తాత్సారం!

- రైస్‌మిల్లుల్లో మాయమవుతున్న వడ్లు
- సివిల్ సప్లయి అధికారుల అలసత్వం

- 'సరిగ్గా నెల రోజుల క్రితం కోరుట్ల మండలం వెంకటాపూర్‌లో ఓ రా రైస్‌మిల్‌లో సివిల్ సప్లయి అధికారులు తనిఖీలు చేశారు. సుమారు 4 వేల క్వింటాళ్ల ధాన్యం మాయమైనట్లు తేలింది'
- 'మళ్లీ మంగళవారం రాత్రి కోరుట్లలోని ఓ రైస్‌మిల్లులో సివిల్ సప్లయి అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఏకంగా సుమారు 25 వేల క్వింటాళ్ల ధాన్యం కనిపించకుండా పోయింది. దీంతో ఖంగుతిన్న సివిల్ సప్లయి అధికారులు సదరు రైస్ మిల్ యజమానిపై 6ఏ కేసుతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేశారు.'



కోరుట్లలో సివిల్ సప్లయి అధికారులు తనిఖీ చేసిన రైస్‌మిల్

కోరుట్ల: జిల్లాలోని రైస్‌మిల్లుల్లో సివిల్ సప్లయి అధికారులు తనిఖీలు చేయడంలో తాత్సారం చేయడంతో కొన్ని మిల్లుల్లో వడ్లు మాయం అవుతున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. నెల క్రితం తనిఖీలు చేసిన సమయంలో వడ్లు మాయమవుతున్నాయని గుర్తించిన సివిల్ సప్లయి అధికారులు అప్రమత్తమై రోజువారీగా అన్ని రైస్‌మిల్లుల్లో తనిఖీలు కొనసాగిస్తే ఇలాంటి సంఘటనలకు చెక్ పడేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

రెగ్యులర్ తనిఖీలు కరువు

2022–23 వానాకాలం సీజన్‌లో సుమారు 3,35,167 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని జిల్లాలోని 132 రైస్ మిల్లులకు తరలించారు. జూన్ నెలాఖరు వరకు రైస్‌మిల్లుల నుంచి కస్టమ్ మిల్లింగ్ కింద అక్టోబర్ నెలాఖరు వరకు 2,26,585 మెట్రిక్ టన్నుల బియ్యం సివిల్ సప్లయిస్‌కు అప్పగించాలి. జూన్ నెలాఖరు వరకు కేవలం 35,580 క్వింటాళ్ల కస్టమ్ మిల్లింగ్ బియ్యం మాత్రమే రైస్‌మిల్లుల నుంచి సివిల్ సప్లయిస్‌కు సరాఫరా అయినట్లు సమాచారం. సీఎమ్మార్ బియ్యం అప్పగించడంలో కొంత మంది రైస్ మిల్లర్లు నిర్లక్ష్యం చేస్తున్న క్రమంలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి ఎక్కువ మొత్తంలో బియ్యం తెప్పించుకోవాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేశారు. అయినప్పటికీ సివిల్ సప్లయి అధికారులు తాత్సారం వహించి రైస్ మిల్లులను తూతూ మంత్రంగా తనిఖీ చేసి ఎంతవరకు మిల్లింగ్ అయిందన్న విషయంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించలేదు. ఫలితంగా ప్రస్తుతం జిల్లాలోని 70 రా రైస్‌మిల్లుల నుంచి సుమారు 60 శాతం మేర మాత్రమే సీఎమ్మార్ రైస్ సివిల్ సప్లయిస్‌కు చేరినట్లు తెలిసింది. బాయిల్ రైస్ మిల్లులు సీఎమ్మార్ బియ్యం సరిగానే అప్పగిస్తున్నట్లు సమాచారం. అక్టోబర్ చివరి వరకు సీఎమ్మార్ రైస్ అప్పగించడానికి సమయం ఉన్నప్పటికీ రా రైస్ మిల్లుల్లో ఇంకా సుమారుగా 40 శాతం మేర మిగిలి ఉన్న మిల్లింగ్ ఎప్పటికీ పూర్తి అవుతుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

షెడ్లు లేకున్నా వడ్లు పంపారు

జిల్లాలో ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో సుమారుగా 4 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం ఉత్పత్తి ఉండటం వీటిని మిల్లింగ్ చేయడానికి సరిపడా రైస్ మిల్లులు లేకపోవడం సమస్యగా మారింది. ఈక్రమంలో ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేసిన రైస్ మిల్లులకు వాటి సామర్థ్యాన్ని మించి సివిల్ సప్లయిస్ అధికారులు వడ్లు పంపారు. సగం రైస్‌మిల్లుల్లో ధాన్యం నిల్వ చేయడానికి అవసరమైన షెడ్లు లేకున్నా ఆరుబయట టార్పాలిన్ కవర్ల కింద ధాన్యం నిల్వచేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ఆరుబయట ఉంచిన ధాన్యం మొత్తం తడిసి దెబ్బతింది. ఈక్రమంలో రైస్‌మిల్లర్లు సకాలంలో సీఎమ్మార్ బియ్యం సివిల్ సప్లయిస్‌కు అందించడంలో ఆలస్యం జరిగింది. ఇదే సాకుగా కొంత మంది రైస్ మిలర్లు తమ వద్ద ఉన్న ధాన్యం అమ్ముకుని వర్షానికి దెబ్బతిన్నాయని సాకులు చెప్పేందుకు యత్నిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం దెబ్బతిన్న వడ్లను మిల్లింగ్ చేయలేక సీఎమ్మార్ ఇవ్వలేక కొంత మంది రైస్‌మిల్లర్లు నానా అవస్థలు పడుతున్నారు. రైస్‌మిల్లులకు ధాన్యం పంపినప్పటి నుంచి సివిల్ సప్లయిస్ అధికారులు మిల్లింగ్‌పై దృష్టి పెట్టి ఉంటే వడ్లు మాయం అవుతున్న సంఘటనకు చెక్ పడటమే కాకుండా సకాలంలో సీఎమ్మార్ రైస్ సివిల్ సప్లయిస్‌కు చేరి ఉండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎప్పటికప్పుడు ఒత్తిడి తెస్తున్నాం

ధాన్యం మిల్లింగ్ చేసి సీఎమ్మాఆర్ రైస్ పంపాలని రైస్‌మిల్లులపై ఎప్పటికప్పుడు ఒత్తిడి తెస్తున్నా ఫలితం దక్కలేదు. కొన్ని రైస్ మిల్లుల నుంచి చాలా తక్కువగా సీఎమ్మార్ బియ్యం వచ్చింది. రెగ్యులర్‌గా సీఎమ్మార్ బియ్యం పంపించని రా రైస్‌మిల్లులను తనిఖీలు చేస్తున్నాం. తనిఖీల్లో కొన్ని చోట్ల వడ్లు మాయమవుతున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి.

– చందన్‌కుమార్, సివిల్ సప్లయిస్ జిల్లా ఇన్‌చార్జి

క్లుప్తంగా

మంత్రి ఈశ్వర్‌ను కలిసిన మున్నూరుకాపు నాయకులు



మంత్రి ఈశ్వర్‌కు వినతిపత్రం ఇస్తున్న చైర్‌పర్సన్ వసంత, నాయకులు

జగిత్యాలజోన్: రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత ఆధ్వర్యంలో మున్నూరుకాపు సంఘం జిల్లా నాయకులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా జగిత్యాలలో మున్నూరు కాపు విద్యార్థుల కోసం లైబ్రరీ, హాస్టల్, కమ్యూనిటీహాల్ నిర్మాణాలకు స్థలం కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. స్పందించిన మంత్రి ఈ అంశాన్ని పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు, బుగ్గారం జెడ్పీటీసీ సభ్యుడు బాదినేని రాజేందర్, గొల్లపల్లి జెడ్పీటీసీ సభ్యుడు జలంధర్, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, నాయకులు తోట ప్రభాకర్, వేణు, ఆంజనేయులు, భీమయ్య, సమిండ్ల శ్రీనివాస్, కోల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, గంగాధర్, హరి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

గల్ఫ్ దేశాల ప్రాంతీయ సమావేశానికి ఆహ్వానం



భీంరెడ్డి

జగిత్యాలరూరల్: వలస కార్మికుల సామాజిక రక్షణ అనే అంశంపై ఈ నెల 24, 25 తేదీల్లో మలేషియా రాజధాని కౌలలంపూర్‌లో జరిగే గల్ఫ్ దేశాల ప్రాంతీయ సమావేశానికి ఎమిగ్రేట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు మంద భీంరెడ్డికి ఆహ్వానం అందింది. ఫిలిప్పిన్స్ కేంద్రంగా పని చేసే మైగ్రెంట్ ఫోరం ఇన్ ఏసియా, మలేషియా కేంద్రంగా పని చేసే అవర్ జర్నీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం జరగనుంది. దీనికి ఆగ్నేయాసియా, దక్షిణాసియా, గల్ఫ్ మధ్య ప్రాచ్య దేశాల ప్రతినిధులు హాజరు కానున్నట్లు భీంరెడ్డి తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీకి పెగ్గెర్ల ఎంపీటీసీ రాజీనామా

కథలాపూర్: మండలంలోని ఊటిపెల్లి, పెగ్గెర్ల గ్రామాల పరిధి ఎంపీటీసీ బాదినేని రమేశ్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు బుధవారం తెలిపారు. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షుడికి లేఖ పంపించినట్లు పేర్కొన్నారు. రమేశ్ 2019లో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు. బుధవారం ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది.

రైసుమిల్లులో షార్ట్‌సర్క్యూట్

జమ్మికుంట(హుజూరాబాద్): మున్సిపల్ పరిధిలో అబాది జమ్మికుంట ఏరియా వీణవంక రోడ్డులోని శ్రీ శక్తి ఇండస్ట్రీస్‌లో బుధవారం షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని, మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో 1,000 వరకు ధాన్యం బస్తాలు, గన్నీ సంచులు కాలిపోయాయి. రూ.10 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని మిలు యజమాని అయిత మహేశ్ తెలిపారు.

జిల్లాలో జోరుగా వరి నాట్లు

- మగవారికి కూలి రూ.800, ఆడవారికి రూ.500
- రైతులను వేధిస్తున్న కూలీల సమస్య
- తేలికగా ఉండే ఉపాధిహామీ పనులకు వెళ్తున్న వైనం



చల్‌గల్‌లో కూలీలు దొరక్క దంపతులే వరి నారు తీస్తున్న దృశ్యం



నాటు వేస్తున్న మహిళా కూలీలు

జగిత్యాల అగ్రికల్చర్: జిల్లాలో వర్షాలు కురుస్తుండటంతో వరి నాట్లు జోరందుకున్నాయి. అయితే, కూలీల సమస్య రైతులను వేధిస్తోంది. గ్రామాల్లో అడపాదడపా నాటు వేసేందుకు వచ్చే కూలీలు సైతం తేలికగా ఉండే ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో నాటు వేసే మహిళా గ్రూపులకు అడిగినన్ని డబ్బులు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

దాదాపు 3 లక్షల ఎకరాల్లో సాగు..

జగిత్యాల జిల్లాలో ఓవైపు ఎస్సారెస్పీ నీరు వచ్చే అవకాశం ఉండటం, వరద కాల్వకు తూములు, మోటార్ల ద్వారా సాగు నీరందుతుండటం, వ్యవసాయ బావులు, బోర్లలో పుష్కలంగా నీళ్లు ఉండటంతో వరి సాగు విస్తీర్ణం ఘననీయంగా పెరగనుంది. ఈ వానాకాలం సీజన్‌లో రైతులు దాదాపు 3 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. వర్షాలు కురుస్తుండటంతో రైతులందరూ ఒకేసారి నాట్లు వేస్తున్నారు. దీంతో కూలీలు సరిపడా దొరకడం లేదు. ఎకరంలో నాటు వేసేందుకు ఆడవాళ్లు 8 మంది, నారు పంచేందుకు మగవాళ్లు ఇద్దరు అవసరం. ఇలా ఒక గ్రామంలోనే కనీసం నాలుగైదు వందల మంది కూలీలు కావాలి.

కూలీలకు అడ్వాన్స్ చెల్లింపు..

నాటు వేసే ఆడ, మగ కూలీలకు రైతులు అడ్వాన్స్ చెల్లిస్తున్నారు. వరి నాట్ల కూలి గతేడాదితో పోల్చితే ఈసారి రూ.100 పెరిగింది. ఆడవారికి రూ.500, మగవారికి రూ.800 వరకు చెల్లించాల్సి వస్తోందని అన్నదాతలు చెబుతున్నారు. అంతేకాకుండా, కూలీలను ఇంటి నుంచి పొలానికి తీసుకురావడానికి ఆటో లేదా జీపు కిరాయి చెల్లిస్తున్నామని తెలిపారు. వరి నాటు ఖర్చులు భారమవుతున్నాయని అంటున్నారు. నాటు ఆలస్యంగా వేద్దామంటే, వరి నారు ముదరడం, దిగుబడి తగ్గుతుందన్న భయంతో ఎంత ఖర్చయినా నాట్లు వేసేందుకే మొగ్గు చూపుతున్నామని పేర్కొంటున్నారు.

శారీరక శ్రమ తగ్గించుకునేందుకు..

గతంలో నాలుగైదు రైతు కుటుంబాలు కలిసి, ఒకరి తర్వాత ఒకరు 15 నుంచి 20 రోజుల వరకు వరి నాట్లు వేసుకునేవారు. రైతులు, వారి కుటుంబసభ్యులకు తోడు ఒకరిద్దరు కూలీలను పిలుచుకొని, సకాలంలో నాట్లు వేసుకునేవారు. ఇప్పుడు మారిన పరిస్థితుల నేపథ్యంలో ఎంత ఖర్చయినా వెనకాడకుండా శారీరక శ్రమ తగ్గించుకుంటున్నారు. బురద అంటకుండానే వరి నాటు వేయిస్తున్నారు. కూలీల కొరత నేపథ్యంలో ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని అన్నదాతలు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

కూలీలు దొరకడం లేదు



పొలం నాటు వేయాలని వారం రోజులుగా తిరుగుతుంటే కూలీలు దొరకడం లేదు. రైతులందరూ ఒకేసారి నాటు వేస్తుండటం ఇబ్బందిగా మారింది. నేను, నా భార్య నారు తీశాం. ఇతర గ్రామాల నుంచి కూలీలను ఆటోల్లో, జీపుల్లో తీసుకువచ్చి నాటు వేయిస్తున్నాం.

– కోల నారాయణ, చల్‌గల్, జగిత్యాల రూరల్ మండలం

ఉపాధిహామీకి అనుసంధానం చేయాలి



వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదు. బురదలో దిగి నాటు వేసేందుకు అసలే రావడం లేదు. వ్యవసాయాన్ని ఉపాధిహామీ పథకానికి అనుసంధానం చేస్తేనే సమస్య పరిష్కారమవుతుంది. కూలీలకు ఇచ్చే వేతనంలో సగం ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

– సందిరెడ్డి తిరుపతి రెడ్డి, చిన్న మెట్‌పల్లి, కోరుట్ల మండలం

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి



రాజ్‌కుమార్ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): తండ్రి మందలించాడని ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడు చికిత్స పొందుతూ చనిపోయాడు. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని హౌసింగ్‌బోర్డుకాలనీకి చెందిన ముప్పు రాజ్‌కుమార్(19) పాలిటెక్నిక్ డిప్లొమా మధ్యలో ఆపివేశాడు. ఇంటివద్దే ఖాళీగా ఉంటున్నాడు. ఈ మధ్య కొత్త సెల్‌ఫోన్ కొనివ్వాలని తండ్రిని పలుమార్లు అడిగాడు. ఇప్పుడు ఫోన్ ఎందుకని తండ్రి మందలించడంతో ఈనెల 2న పురుగుల మందుతాగాడు. కుటుంబసభ్యులు ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం చనిపోయాడు. మృతుడి తండ్రి కుమారస్వామి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ రవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కరీంనగర్‌లో..

కరీంనగర్‌క్రైం: కళాశాలకు సరిగా వెళ్లడంలేదని తల్లిదండ్రులు మందలించడంతో పురుగుల మందు తాగిన యువకుడు బుధవారం ఉదయం చనిపోయాడు. కరీంనగర్ టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మానకొండూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన రుద్రోజు మహేశ్వరచారి(18) నగరంలోని ఒక కళాశాలలో ఒకేషనల్ కోర్సు చదువుతున్నాడు. కళాశాలకు సరిగా వెళ్లకపోవడం, ఇంట్లో ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతుండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మహేశ్వరచారి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రి వద్ద పురుగుల మందు తాగాడు. స్థానికులు అతని తల్లిదండ్రులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ బుధవారం చనిపోయాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

జేపీఎస్‌ల క్రమబద్ధీకరణకు పనితీరే ప్రామాణికం

- అడిషనల్ కలెక్టర్ దివాకరణ్
- కొత్తదాంరాజుపల్లి, వాల్గొండ తండా గ్రామాల్లో పనుల పరిశీలన



కొత్తదాంరాజుపల్లిలో పనులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ దివాకరణ్

మల్లాపూర్: జిల్లాలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణకు వారి పనితీరే ప్రామాణికంగా తీసుకోనున్నట్లు అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు) దివాకరణ్ తెలిపారు. బుధవారం మల్లాపూర్ మండలంలోని కొత్తదాంరాజుపల్లి, వాల్గొండ తండా గ్రామాల్లో ఆయన పర్యటించారు. కార్యదర్శులు చేపట్టిన పనులను పరిశీలించారు. జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, అటవీశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, సర్పంచులు సరిత, కళావతి పాల్గొన్నారు.

సంగెం గ్రామంలో..

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెంలో అడిషనల్ కలెక్టర్ దివాకరణ్ బుధవారం పర్యటించారు. నర్సరీలు, మొక్కల పెంపకం, మౌలిక సదుపాయాలు, పన్నుల వసూళ్లు, విద్యుత్ బిల్లుల చెల్లింపు, ఇంటింటి చెత్త సేకరణ, జనన, మరణ రిజిష్టర్లను తనిఖీ చేశారు. జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వెంకట్రావు, సర్పంచ్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకాలకు అనుగుణంగా..

జగిత్యాల: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీస్ క్రమబద్ధీకరణ జరుగుతుందని అదనపు కలెక్టర్ దివాకర అన్నారు. బుధవారం పంచాయతీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో పనిచేస్తున్న 281 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శుల్లో 183 మంది నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. 8 అంశాల్లో పర్ఫామెన్స్ ఆధారంగా సర్వీస్ క్రమబద్ధీకరించడం జరుగుతుందన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పనితీరును పరిశీలించేందుకు ఎంపీడీవో, అటవీ రేంజ్ అధికారి, వ్యవసాయ అధికారుల ద్వారా మండల స్థాయి కమిటీలు వేసినట్లు తెలిపారు. మౌలిక సదుపాయాలు, వందశాతం పన్నుల వసూళ్లు, నర్సరీలు, మొక్కల సంరక్షణ, విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ల నెలవారీ వాయిదాల చెల్లింపులు, 10శాతం గ్రీన్ బడ్జెట్ వినియోగం, ఇంటింటా చెత్త సేకరణ, జనన మరణ ధ్రువీకరణ పత్రాల నిర్వహణ వంటి అంశాల్లో 100మార్కులతో పనితీరు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. పంచాయతీ అధికారి దేవరాజ్, డివిజన్ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

'మన ఊరు–మన బడి' వేగవంతం చేయాలి

మన ఊరు–మన బడి పనులు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ దివాకరణ్ అన్నారు. బుధవారం ఇంజినీరింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 274 పాఠశాలల్లో పనులకు ప్రతిపాదించగా 24 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని, మిగతావి కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈనెలాఖరుకు 11, ఆగస్టు నెలలో 18 పనులు పూర్తవుతాయని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

నులిపురుగుల నిర్మూలనలో భాగస్వాములవ్వాలి

- నేడు జిల్లాలో 1 నుంచి 19 ఏళ్లవారికి మాత్రల పంపిణీ
- డీఎంహెచ్‌వో శ్రీధర్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీధర్

జగిత్యాల: నులిపురుగుల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఎంహెచ్‌వో పుప్పాల శ్రీధర్ కోరారు. బుధవారం జగిత్యాలలోని తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నులిపురుగులు మనిషి పేగుల నుంచి పోషకాలను గ్రహించి, ఇబ్బందులకు గురిచేస్తాయని తెలిపారు. సాధారణంగా మూడు రకాల పురుగులు ఏలిక పాములు, నులి, కొంకి పురుగులు ఉంటాయన్నారు. ఇవి ఆరుబయట వట్టి కాళ్లతో ఆడుకోవడం, చేతులు కడుక్కోకుండా ఆహారం తినడం, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయడం ద్వారా పిల్లల శరీరంలోకి ప్రవేశిస్తాయని చెప్పారు. వీటి వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వందశాతం నివారణ సాధ్యమవుతుందన్నారు. గురువారం జిల్లాలోని 2,50,164 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తామని పేర్కొన్నారు. 1 నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలందరికీ అందేలా చూడాలన్నారు. 1 నుంచి 2 సంవత్సరాలలోపు పిల్లలకు 1/2 మాత్రను పొడిచేసి, నీటి కలిపి, తాగించాలని సూచించారు. 2 నుంచి 19 ఏళ్లలోపు వారికి ఒక మాత్ర ఇవ్వవచ్చన్నారు. జిల్లాలో 22 పట్టణ ప్రాథమిక కేంద్రాలతోపాటు, 839 ప్రభుత్వ, 316 ప్రైవేటు పాఠశాలలు, 54 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు, 1,025 అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రలు వేస్తారని చెప్పారు. మిస్సయిన వారికి ఈ నెల 27న అందిస్తారని తెలిపారు. సమావేశంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి

ధర్మపురి: చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. ధర్మపురి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నులిపురుగుల నిర్మూలన నిమిత్తం 19 ఏళ్ల వయసులోపు వారు ఆల్బెండజోల్ మాత్రలు చప్పరించేలా చూడాలన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ప్రభుత్వ ఉపాధ్యాయులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

మోసపోయి.. అప్పులపై దిగులు చెంది

- దుబాయిలో వెంకట్రావుపేటవాసి ఆత్మహత్య



సాయిలు (ఫైల్)

కథలాపూర్: ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లిన ఓ వ్యక్తి పని విషయంలో మోసపోయాడు.. తీర్చాల్సిన అప్పులపై దిగులు చెంది, అక్కడే ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమారం మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన పస్తం సాయిలు(34)కు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. అతను స్థానికంగా కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. రూ.8 లక్షల వరకు అప్పులు ఉండటంతో ఏడాది క్రితం ఉపాధి కోసం దుబాయి వెళ్లాడు. అక్కడ పని విషయంలో మోసం జరగడంతో అప్పులు ఎలా తీర్చాలని ఆందోళన చెందాడు. మార్గం లేకపోవడంతో మనస్తాపానికి గురై, బుధవారం సాయంత్రం ఉరేసుకున్నాడు. తోటి కార్మికుల ద్వారా ఫోన్‌లో విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సాయిలు దుబాయితోపాటు గ్రామంలో చేసిన అప్పులు సుమారు రూ.10 లక్షల వరకు ఉంటాయని గ్రామస్తులు తెలిపారు. అతని మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువచ్చేందుకు గల్ఫ్ అధికారులతో సంప్రదింపులు జరిపినట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్ గౌడ్ పేర్కొన్నారు.

నేడు బెస్ట్ అవేలబుల్ స్కూళ్లలో ప్రవేశానికి లాటరీ

జగిత్యాల: బెస్ట్ అవేలబుల్ స్కూల్స్ రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ 1, 5వ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు గురువారం కలెక్టరేట్‌కు రావాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ అధ్యక్షతన కమిటీ సభ్యులు పిల్లల తల్లిదండ్రుల సమక్షంలో లాటరీ పద్ధతి ద్వారా సీట్లు కేటాయిస్తారన్నారు. ఉదయం 11 గంటలకు హాజరు కావాలని సూచించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



కల్యాణ్ (ఫైల్)

రాయికల్: మండలంలోని కుర్మపెల్లి గ్రామానికి చెందిన ఆది కల్యాణ్(23) విద్యుదాఘాతంతో మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. అతను బుధవారం పొలంలో ఉన్న మోటార్‌కు మరమ్మతు చేయించి, బిగించాడన్నారు. అనంతరం పొలానికి నీరు పెట్టేందుకు మోటార్‌ను ఆన్ చేయగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై, అక్కడికక్కడే మృతిచెందాడని చెప్పారు.

జగిత్యాల మున్సిపల్ ఆఫీస్‌లో కంట్రోల్‌రూమ్

- వర్షాల నేపథ్యంలో ఏర్పాటు
- 24 గంటలపాటు అందుబాటులో సిబ్బంది

జగిత్యాల: వానాకాలం దృష్ట్యా ప్రజలకు అత్యవసర సేవలందించేందుకు జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ నరేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. 24 గంటలపాటు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. 6–6 హెల్ప్‌డెస్క్–95503 33241, 88858 81808, పారిశుద్ధ్య విభాగం సేవల కోసం 88979 67134, నీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయం కోసం 94408 69750, శిథిలావస్థలో ఉన్న పురాతన భవనాల కూల్చివేతకు 95155 54590 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు



పెద్దపల్లిరూరల్: ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన దొంగను పెద్దపల్లి పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్‌కు చెందిన మహంకాళి దిలీప్ బుధవారం పెద్దపల్లిలో అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని, విచారించగా ద్విచక్రవాహనాలు దొంగిలించిన విషయం చెప్పాడు. అతను ఇచ్చిన సమాచారంతో రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ అనిల్ పేర్కొన్నారు. కరీంనగర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి, పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని చందపల్లిలో ఒక ద్విచక్రవాహనాన్ని చోరీ చేశాడన్నారు. పెద్దపల్లి ఎస్సై మహేందర్, మల్లేశ్, ఏఎస్సై రామస్వామి ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట స్వీపర్ల నిరసన



జగిత్యాలటౌన్: వేతనాల పెంపుతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాలల స్వీపర్లు బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బైఠాయించి వర్షాన్ని లెక్క చేయకుండా తమ నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకురాలు ఇందూరి సులోచన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో చాలీచాలని జీతాలతో వెట్టిచాకిరి చేస్తున్న స్వీపర్ల సేవలను గుర్తించి వారికి రూ.26వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్వీపర్లకు ఉద్యోగ భద్రత కల్పించి క్రమబద్ధీకరించాలని కోరారు. స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజ్‌మహ్మద్, ఉపాధ్యక్షుడు ఆర్ వెంకటరాజం, సీపీఎం నాయకుడు రమేశ్, వివిధ మండలాల ప్రభుత్వ పాఠశాలల స్వీపర్లు పాల్గొన్నారు.

స్వగ్రామం చేరిన వలసజీవి మృతదేహం

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన గెరిగంటి నర్సింలు(40) పది రోజుల క్రితం బహ్రెయిన్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోగా.. బుధవారం మృతదేహం స్వగ్రామం చేరింది. కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. పాతికేళ్లుగా నర్సింలు బహ్రెయిన్ వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. మృతునికి భార్య రాధ, ముగ్గురు కుమార్తెలు నవిత, అక్షయ, సాత్విక ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

బైక్ అదుపుతప్పి ఒకరి దుర్మరణం

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల–రగుడు బైపాస్ రోడ్డుపై బుధవారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన బండి సందీప్(26) వరుసకు సోదరుడైన బండి బాబు కలిసి బుధవారం కోనరావుపేట మండలం సుద్దాలకు వెళ్లారు. తిరిగి సొంతూరికి వస్తుండగా రగుడు వద్ద అసంపూర్తిగా ఉన్న బైపాస్ రోడ్డుపై బైక్ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో సందీప్ తలకు గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. బాబుకు తీవ్రగాయాలవడంతో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య లాస్య, మూడేళ్ల కూతురు ఉన్నారు.



భారీ వర్షం.. రోడ్లన్నీ జలమయం

జగిత్యాల: జిల్లా కేంద్రంలో బుధవారం ఉదయం నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రెయినేజీలు పొంగిపొర్లాయి. కొన్నిచోట్ల కాలనీలు చెరువులను తలపించాయి.

